
సాక్షి
ఒడిశా
శుక్రవారం | 28 | జూన్ | 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.1,07,712లు వచ్చాయని అధికారులు తెలిపారు.



రాష్ట్రపతి ముర్ముతో సీఎం భేటీ

ముఖ్యమంత్రి మోహన్‌ చరణ్‌ మాఝి, ఉప ముఖ్యమంత్రులు కనకవర్ధన్‌ సింగ్‌ దేవ్‌, ప్రభాతి పరిడాలతో కలిసి గురువారం న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు.

- 8లో



అర్హులందరికీ రేషన్‌ కార్డులు

అర్హులైన వారందరికీ రేషన్‌ కార్డులు పంపిణీ చేసే ప్రక్రియ త్వరలో ప్రారంభమవుతుందని మంత్రి కృష్ణ చంద్ర పాత్రో తెలియజేశారు.

- 8లో

న్యూస్‌రీల్‌

పాముకాటుతో యువతి మృతి



సుప్రియ మృతదేహం

రాయగడ: పాముకాటు వేయడంతో ఒక యువతి మృతి చెందిన ఘటన జిల్లాలోని చంద్రపూర్‌ సమితి హనుమంతపూర్‌ పంచాయతీలోని బంధుగాం గ్రామంలో చోటుచేసుకుంది. మృతురాలు అదే గ్రామానికి చెందిన రాముడు జగరంగ కూతురైన సుప్రియ (17)గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. సుప్రియ తల్లి గత కొద్ది నెలలుగా అస్వస్థతతో మంచం పట్టింది. ఈ నేపథ్యంలో సుప్రియ ఇంటి పనులతో పాటు తన తల్లికి అవసరమైన పనులను చేస్తుండేది. ఈ క్రమంలో బుధవారం రాత్రి తన తల్లిని బాత్‌రూంకు తీసుకెళ్లి తిరిగి వచ్చింది. అనంతరం పడుకుంది. తెల్లవారుజామున సుప్రియ తీవ్ర అస్వస్థతకు గురవ్వడం గమనించిన తండ్రి రాముడు చూడగా పాము కాటు వేసినట్లు గుర్తించాడు. వెంటనే ఇరుగుపొరుగు వారి సాయంతో సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

గంజాయి పట్టివేత



గంజాయితో అరెస్టైన నిందితులు

రాయగడ: రాయగడ నుంచి రాయిపూర్‌కు ట్రైన్‌లో గంజాయిని అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 28 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో అరెస్టైనవారిలో రాయిపూర్‌కు చెందిన సీనత్‌ బిద్యా(20), షేక్‌ రాణ (20)లు ఉన్నారు. బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. రైల్వే డీఎస్పీ నిరంజన్‌ పాడి ఆదేశానుసారం జీఆర్పీ అధికారి బిజయ్‌ బెక్‌, ఏఎస్‌ఐ బానిక్‌ చంద్ర గౌడా సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్‌లో గురువారం దాడులు నిర్వహించారు. ఈ సమయంలో ఫ్లాట్‌ఫారం నంబర్‌ 2లో అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని తనిఖీ చేయగా, వారి బ్యాగుల్లో 28 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ మేరకు వారిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.2.20 లక్షలు ఉంటుందని అంచనా వేశారు.

పేపరు మిల్లుపై సీఎంను కలవాలని నిర్ణయం



సమావేశంలో పాల్గొన్న పేపరు మిల్లు కార్మికులు

జయపురం: స్థానిక గగణాపూర్‌లోని సేవా పేపరు మిల్లు కార్మికులు, విశ్రాంత కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం మోహన్‌ చరణ్‌ మాఝిని కలిసేందుకు నిర్ణయించారు. స్థానిక కార్మిక భవనంలో పేపరు మిల్లు శ్రామికులు, విశ్రాంత శ్రామికుల సంయుక్తంగా సమావేశాన్ని భారతీయ మజుదూర్‌ సంఘం ప్రాంతీయ అధ్యక్షుడు బాలకృష్ణ ప్రధాన్‌ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ ప్రధాన్‌ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను ప్రస్తావించారు. ఎంతోకాలంగా సమస్యలను పరిష్కరించాలని మిల్లు యాజమాన్యానికి, జిల్లా లేబర్‌ అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన భువనేశ్వర్‌ వెళ్లి నూతన ముఖ్యమంత్రి మోహన్‌ చరణ్‌ మాఝిని కలిసి వినతిపత్రం అందజేయాలని నిర్ణయించారు. అలాగే కార్మిక శాఖ మంత్రి, పరిశ్రమల మంత్రి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని కలిసి వినతిపత్రాలు అందజేద్దామని దానికి అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. జూలై 1వ తేదీ నుంచి మిల్లు ప్రధాన గేటు ముందు ప్రతిరోజై ఇద్దరు కార్మికులు ధర్నా చేయాలని నిర్ణయించారు. సమావేశంలో బసంత బెహర, సుదర్శన బిశాయి, ప్రహ్లాద్‌ మల్లిక్‌, సుభాష్‌ బెహర, అలోక్‌ పాత్రో, నరసింహ మహాపాత్రో, డి.పి.అగస్తి తదితరులు పాల్గొన్నారు.

గజరాజుల.. బీభత్సం



- ఇంటి పైకప్పు ఎక్కి ప్రాణాలు కాపాడుకున్న గ్రామస్తులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

రాయగడ: జిల్లాలో మునిగుడ అటవీ రేంజ్‌ పరిధిలోని శివపదర పంచాయతీ పనిముండ గ్రామంలో బుధవారం రాత్రి ఏనుగులు బీభత్సం సృష్టించాయి. ఒక్కసారిగా సుమారు 12 ఏనుగుల గుంపు గ్రామంలోకి చొరబడడంతో గ్రామస్తులు ప్రాణభయంతో ఇళ్లలో విద్యుత్‌ దీపాలను ఆఫ్‌చేసి సమీపంలోని ఒక మేడ ఇంటిపైకి ఎక్కి, అరచేతిలో ప్రాణాలు పట్టుకొని తెల్లవారుజాము వరకు బిక్కు బిక్కుమంటూ గడిపారు. గ్రామం మొత్తం ఏనుగుల ఘీంకారాలతో దద్దరిల్లిపోయింది. పలు ఇళ్లలోకి ఏనుగులు చొరబడి సామగ్రిని ధ్వంసం చేశాయి. ఎండు చేపల వ్యాపారాలు చేసేవారి ఇళ్లల్లో మొత్తం చేపలను కిందపడేశాయి. మరొకరి ద్విచక్ర వాహనాన్ని బయట ఉంచడంతో దానిని కిందపడివేసి తొక్కేశాయి. ఇవన్నీ చూస్తునే గ్రామస్తులు ఇంటి పైకప్పు మీద ఉండిపోయారు. తెల్లవారు ఏడు గంటల సమయంలో ఏనుగులు తిరిగి గ్రామం నుంచి సమీప అడవుల్లోకి వెళ్లిపోవడంతో గ్రామస్తులు తిరిగి తమ తమ ఇళ్లకు వెళ్లి చూసి ఆవేదనకు గురయ్యారు. సమాచారాన్ని మునిగుడ అటవీ శాఖ అధికారులకు తెలియజేయడంతో అటవీ శాఖ అధికారి అనిల్‌ కుమార్‌ బాల్‌, ఫారెస్టర్‌ ప్రమోదిని మండంగి, అటవీ సిబ్బంది బాధిత గ్రామంలో గురువారం పర్యటించారు. ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురవ్వొద్దని భరోసా ఇచ్చారు. ప్రత్యేక సిబ్బంది గ్రామంలో కాపలా ఉండి ఏనుగులను తరిమి కొట్టే ప్రయత్నం చేస్తామని తెలియజేశారు. ఈ ఏనుగుల గుంపు కల్యాణసింగుపూర్‌ అడవుల నుంచి ఇక్కడికి వచ్చినట్లు తెలుస్తోంది.



ఇళ్లలో సామాన్లను ధ్వంసం చేసిన ఏనుగులు



బైకును పడేసిన ఏనుగులు

రథయాత్ర బందోబస్తుపై సమీక్ష



సన్నాహక సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్‌: ప్రసిద్ధ పూరీ జగన్నాథ రథయాత్రకు ముందు బందోబస్తు ఏర్పాట్లపై డైరెక్టర్‌ జనరల్‌ ఆఫ్‌ పోలీస్‌ (డీజీపీ) అరుణ్‌ కుమార్‌ షడంగి సన్నాహక సమావేశం నిర్వహించారు. కటక్‌లోని పోలీస్‌ ప్రధాన కార్యాలయంలో సీనియర్‌ పోలీసు అధికారులతో గురువారం సమావేశమయ్యారు. రథయాత్ర సమయంలో భారత రాష్ట్రపతి రాష్ట్ర పర్యటనకు విచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భద్రతా కార్యకలాపాల్లో పోలీసు యంత్రాంగం అత్యంత చురుకుగా పాలుపంచుకోవాలని ఆదేశించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్‌ రఘుబర్‌ దాస్‌, ముఖ్యమంత్రి మోహన్‌ చరణ్‌ మాఝితో సహా వివిధ వీవీఐపీలు ఈ సంవత్సరం రథయాత్ర ప్రత్యక్షంగా తిలకించేందుకు హాజరు కానున్నారు. మరోవైపు ఒకే రోజున శ్రీజగన్నాథుని నవ యవ్వన అలంకరణ, నేత్రోత్సవం, రథయాత్ర జరుగుతున్నందున దేవస్థానం లోపల, వెలుపల భద్రతా వ్యవస్థ మరో సవాలుగా నిలుస్తుందని డీజీపీ అధికారులను అప్రమత్తం చేశారు. ఈ కార్యక్రమాలు జూలై 7న జరుగుతాయి. మారురథ యాత్ర బహుడా జూలై 15న, స్వర్ణ అలంకార దర్శనం జూలై 17 మరియు నీలాద్రి బిజే జూలై 19న నిర్వహించనున్నారు. రథయాత్రకు భారత రాష్ట్రపతి మొదలుకొని పలువురు ఉన్నత స్థాయి నాయకులు, అధికారులు హాజరవుతారు. భద్రతా ఏర్పాట్లు పూర్తి స్థాయిలో పటిష్టపరచడంపై అధికారులు తొలి నుంచి ప్రత్యేక కార్యాచరణలో నిమగ్నమై ఉంటారని తెలిపారు. బాంబ్‌ డిస్పోజల్‌ స్క్వాడ్‌లు, హెచ్‌హెచ్‌ఎండీ, డీఎంఎఫ్‌డీ, మెటల్‌ డిటెక్టర్లు, కౌంటర్‌ ఇంటెలిజెన్స్‌ స్క్వాడ్‌లను భద్రతా కార్యకలాపాల్లో సమన్వయపరచనున్నారు. పూరీ పట్టణంలోని అన్ని ప్రధాన కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. సాగర తీరంలో రక్షణ పహారా ముమ్మరం చేయనున్నారు. సాఫీగా వాహనాల రాకపోకలకు రోడ్డు డివైడర్‌, డీలినేటర్‌, ట్రాఫిక్‌ జోన్లు ఏర్పాట్లు చేయనున్నారు. యాత్రికుల కోసం పట్టణంలో తాత్కాలిక పోలీసు అవుట్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు.

చోరీ కేసు నిందితులు అరెస్టు



అరెస్టైన నిందితులతో పోలీసులు

జయపురం: ఒక కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్న వ్యక్తిపై దాడి జరిపి నగదు, సెల్‌ఫోన్‌ దోచుకున్న నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు జయపురం పట్టణ పోలీసు అధికారి రశ్మీ రంజన్‌ దొలాయ్‌ గురువారం వెల్లడించారు. అరెస్టైనవారు ఇరిగేషన్‌ కాలనీకి అశోక్‌ కుమార్‌ సెట్టి, శంకర ఖొడ, ఖెంధుగుడ గ్రామానికి చెందిన మనోజ్‌ జాని, సొరగుడ గ్రామానికి చెందిన శశిభూషణ నాయిక్‌లుగా పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, కొంత నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. వివరాల్లోకి వెళ్తే.. జయపురం పూర్ణఘడ్‌ ప్రాంతానికి చెందిన సదాశివ సాహు అనే వ్యక్తి ఒక కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 18వ తేదీన సాహు వ్యాన్‌లో సరుకులు తీసుకొని నబరంగపూర్‌ వెళ్లాడు. పని ముగించుకొని రాత్రి 11 గంటల సమయంలో జయపురం చేరాడు. రత్నాకరగుడ కెనాల్‌ రోడ్డులో కార్యాలయంలో వాహనం ఉంచి ఇంటికి వెళ్తున్న సమయంలో, రెండు ద్విచక్ర వాహనాలపై దుండగులు వచ్చి ఫారెస్టు శిక్షణా కేంద్రం వద్ద సాహునిపై దాడి చేశారు. అతడి వద్దనున్న బంగారు ఉంగరం, ఒక మొబైల్‌ సెల్‌ఫోన్‌, రూ.1,500 నగదు దోచుకుపోయారు. దుండగుల చేతిలో దెబ్బలు తిన్న సాహుని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో స్థానికులు చేర్చారు. ఈనెల 23వ తేదీన బాధితుడు సదాశివ సాహు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ సిద్ధార్థ కుమార్‌ బెహర దర్యాప్తు జరిపి నిందితులను గుర్తించి, అరెస్టు చేసినట్లు తెలిపారు.

'దశమంతపూర్‌ అభివృద్ధికి ప్రాధాన్యం'



ప్రజలకు అభివాదం చేస్తున్న కాంగ్రెస్‌ ఎమ్మెల్యేలు

జయపురం: దశమంతపూర్‌ సమితి అభివృద్ధికి తాము అధిక ప్రాధాన్యమిస్తామని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్‌ బాహిణీపతి, లక్ష్మీపూర్‌ ఎమ్మెల్యే పవిత్ర శాంతలు అన్నారు. ఈ ఎన్నికల్లో గెలిపొందిన అనంతరం మొదటిసారి దశమంతపూర్‌ వచ్చిన వారికి ప్రజలు పూలమాలలతో గురువారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవిత్ర శాంత మాట్లాడుతూ దశమంతపూర్‌ వెనుకబడిన సమితి అని, సమితి అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి తాను పని చేస్తానన్నారు. తనకు ఎమ్మెల్యే బాహిణీపతి చేదోడువాదోడుగా ఉంటారని పేర్కొన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చినా తనకు తెలియజేయాలన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్‌ పార్టీ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో సమితి కాంగ్రెస్‌ అధ్యక్షుడు వేణుధర పాత్ర, సమితి అధ్యక్షుడు కైలాస కోశల, బందుగా కాంగ్రెస్‌ అధ్యక్షుడు డి.ఎన్‌కేటీ, కాంగ్రెస్‌ పర్యవేక్షకుడు జగదీష్‌ కోశల, బందుగాం కాంగ్రెస్‌ కార్యదర్శి మోహన్‌పాత్ర హియాల్‌, నాయకులు పద్మన్‌ సాగర్‌, రమేష్‌ నాయిక్‌, మార్టిన్‌ కోశల, ప్రమోద్‌ ఖోర, లక్ష్మణ్‌ బిశాయి, యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు పంకజ బాగ్‌, సుమన్‌ పాత్రో, అశోక్‌ కోశల తదితరులు పాల్గొన్నారు.

• మర్యాదపూర్వక భేటీ



పార్లమెంట్‌ ఆవరణలో బీజేడీ మాజీ ఎంపీలు

కొరాపుట్‌: సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత ఓటమి పాలైన బీజేడీ ఎంపీలు భారత పార్లమెంట్‌ ఆవరణలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గురువారం సెంట్రల్‌ హాల్‌కి నబరంగ్‌పూర్‌ మాజీ ఎంపీ రమేష్‌ చంద్ర మజ్జి వెళ్లారు. అక్కడే బ్రహ్మపూర్‌ మాజీ ఎంపీ చంద్రశేఖర్‌ సాహు, భద్రక్‌ మాజీ ఎంపీ మంజులత మండల్‌లు ఉన్నారు. వారు తమ ఓటమికి గల కారణాలు విశ్లేషించుకున్నారు. ప్రస్తుతం బీజేడీ పార్టీ రాష్ట్రంలో ఒక్క ఎంపీ సీటు కూడా గెలుచుకోలేదు. ప్రస్తుతం పరాజితులైన సిట్టింగ్‌ ఎంపీలు న్యూఢిల్లీలోని తమ ప్రభుత్వ నివాసాలు ఖాళీ చేసే పనిలో ఉన్నారు.

తిరుపతి పాణిగ్రాహికి అవార్డు ప్రదానం

పర్లాకిమిడి: రాష్ట్రంలోని హైటెక్‌ మెడికల్‌ విద్యా సంస్థల చైర్మన్‌ డా.తిరుపతి పాణిగ్రాహికి బుధవారం రాత్రి భువనేశ్వర్‌లో హోటల్‌ స్వస్తీ ప్రీమియంలో జరిగిన టైమ్స్‌ ఆఫ్‌ ఇండియా డైలీ హెల్త్‌ ఐకాన్స్‌ ఒడిశా (6వ ఎడిషన్‌) అవార్డును అందజేశారు. కార్యక్రమానికి బాలీవుడ్‌ యాక్టర్‌ అనిల్‌ కపూర్‌ విచ్చేసి తిరుపతి పాణిగ్రాహికి 'లెజండరీ లీడర్‌ ఇన్‌ మెడికల్‌ ఎడ్యుకేషన్‌' అవార్డును అందజేశారు. గత నలభై సంవత్సరాలుగా రాష్ట్రంలోని అనేక మారుమూల గ్రామాల్లో వైద్య సేవలు అందించినందుకు టైమ్స్‌ ఆఫ్‌ ఇండియా ఆయనను అవార్డుకు ఎంపిక చేసింది. దీనిపై తిరుపతి పాణిగ్రాహి అవార్డు మరింత బాధ్యత పెంచిందన్నారు.



అనిల్‌ కపూర్‌ చేతులమీదుగా అవార్డును అందుకుంటున్న తిరుపతి పాణిగ్రాహి

అనుమానాస్పదంగా బాలిక మృతి



సునాబెడా ప్రభుత్వ ఆస్పత్రిలో బాలిక మృతదేహం



నిందితుడు బాలికని ఆస్పత్రికి తీసుకెళ్తున్న దృశ్యం

కొరాపుట్‌: బాలిక అనుమానాస్పద మృతి కొరాపుట్‌ జిల్లాలో సంచలనంగా మారింది. కొరాపుట్‌ జిల్లా సునాబెడా ప్రభుత్వ ఆస్పత్రికి ఒక గుర్తు తెలియని వ్యక్తి ఒక బాలికని తెసుకొచ్చి వదలి వెళ్లాడు. సమయం మించిపోతున్నా అతను తిరిగి రాకపోవడంతో పక్కనున్న రోగులు పరిశీలించగా బాలికలో చలనం లేదు. వెంటనే వైద్య సిబ్బంది అక్కడికి చేరుకొని పరిశీలించగా బాలిక మృతి చెంది ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు. అనుమానితుడి ఫోటోను సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేశారు. పోలీసుల దర్యాప్తులో బాలిక కొరాపుట్‌ జిల్లా సిమిలిగుడ సమితి పట్టగుడ గ్రామ పంచాయతీ దొరాగుడ గ్రామానికి చెందిన రాం కిలో, భద్రమా సమారాల కుమర్తె సస్మితా కిలో(4) గా గుర్తించారు. నిందితుడు నయాగడ్‌ జిల్లా నుంచి వచ్చి కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఎకనామిక్‌ కారిడర్‌ భారతమాల రోడ్డు నిర్మాణంలో ఒక కాంట్రాక్టర్‌ వద్ద నైట్‌ వాచ్‌మెన్‌గా పని చేస్తున్నట్లు గుర్తించారు. బాధిత బాలిక తల్లిదండ్రులు వచ్చి నిందితుడు తమకు పరిచయం ఉన్నవాడేనని కానీ వాడి పేరు తెలియదని పేర్కొన్నారు. పోలీసులు బాలిక మృతిని అనుమానాస్పద కేసుగా నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి రావడానికి ముందు నిందితుడు బాలికతో సిమిలిగుడలోని ఒక ప్రొవేటు అస్పత్రికి బాలికను తీసుకొని వెళ్లగా వారు తీవ్రమైన కేసుగా పేర్కొని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లమని సూచించారని తెలిసింది. అయితే బాలిక ఎలా చనిపోయిందనే విషయంపై పోలీసులు దర్యప్తు చేస్తున్నారు.

రథయాత్రపై సన్నాహక సమావేశం

జయపురం: పట్టణంలో చారిత్రాత్మక రథయాత్రను అంగరంగ వైభవంగా జరపాలని రథయాత్ర పాలన కమిటీ నిర్ణయించింది. స్థానిక మున్సిపల్‌ సభాగృహంలో జయపురం సబ్‌ కలెక్టర్‌ ప్రభాత్‌ కుమార్‌ పారిడ అధ్యక్షతన రథయాత్ర సన్నాహక సమావేశం జరిగింది. సమావేశంలో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్‌ బాహిణీపతి పాల్గొన్నారు. రథయాత్ర సమయంలో పట్టణంలో మద్యం అమ్మకాలు నిలుపుదల చేయాలని, శాంతి భద్రతలు కాపాడేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు చేయాలన్నారు. వెంటనే గుండిచా మందిరం మరమ్మతులు జరిపి అందంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. దేవదాయ, ధర్మాదాయ అధికారి, జయపురం తహసీల్దార్‌ మనోలిస ఆచార్య రథయాత్ర కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రంలో జూలై 7వ తేదీన రథయాత్ర జరుగుతుందని, అయితే సాంప్రదాయంగా ఆరోజు సాయంత్రం దేవతామూర్తులను రథాలపై ఆశీనులను చేసి, మరునాడు అంటే 8వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు రథాన్ని లాగుతారని వివరించారు. రథంపై 25 మంది సేవాయత్తులను మాత్రం అనుమతించాలన్నారు. శాంతి భద్రతలు కాపాడేందుకు 5 ప్లాటూన్ల బలగాలను మోహరింపజేయాలని సభ్యులు సూచించారు. జేబు దొంగలు, అల్లరిమూకలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గుండిచా మందిరం వద్ద విద్యుత్‌ దీపాల వ్యవస్థ, వైద్య, తాగునీటి సౌకర్యాలు అగ్ని ప్రమాదాల నివారణకు తగు చర్యలు సంబంధిత విభాగాల అధికారులు చేపట్టాలని సమావేశం సూచించింది. సమావేశంలో సబ్‌ డివిజన్‌ పోలీసు అధికారి అంకిత్‌ కుమార్‌ వర్మ, బీడీవో శక్తి మహాపాత్రో, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ బి.సునీత, మున్సిపాలిటీ ఇంజినీర్‌ విశ్వనాథ్‌ పాత్రో, పట్టణ పోలీసు అధికారి రమణీ రంజన్‌ దొలాయ్‌, సదర్‌ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి, జయపురం సబ్‌ డివిజన్‌ సమాచార పౌర సంబంధాల అధికారి యశోద గదబ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

క్లుప్తంగా

కొండచిలువ కలకలం


పట్టుబడిన కొండచిలువ

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి ముండగూడ గయరామం వద్ద వాటర్ ప్లాంట్ ఆవరణలో 7 అడుగుల కొండచిలువ కలకలం సృష్టించింది. ప్లాంట్ ఆవరణలోని వాటర్ క్యాన్‌ల వద్ద కొండచిలువను అక్కడ ఉన్నవారు చూసి స్నేక్ హెల్ప్‌లైన్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి సుమారు 3 గంటల పాటు శ్రమించి కొండచిలువను పట్టుకున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో కొండల నుంచి వచ్చి ఉంటుందని భావిస్తున్నారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానానికి ఆనుకుని ఉన్న గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయింది. గురువారం సాయంత్రం పాఠశాలకు చెందిన 9 మంది బయటకు వెళ్లారు. ఇందులో ఏడుగురు విద్యార్థులు నూడుల్స్‌ను తిన్నారు. నూడుల్స్ తిని హాస్టల్‌కు వచ్చిన కొద్దిసేపటికి జ్వరంతోపాటు వాంతులు, విరేచనాలయ్యాయి. దీంతో వీరందరినీ హుటాహుటిన ఆశ్రమ పాఠశాలకు సమీపంలోనే ఉన్న రిమ్స్ హాస్పటల్‌కు తరలించారు. ఆస్పత్రి ఉన్నతాధికారులకు విషయాన్ని తెలియజేయడంతో వెంటనే మెరుగైన వైద్యాన్ని అందించేలా చర్యలు చేపట్టారు. అయితే నూడుల్స్ తినని ఇద్దరు కూడా స్వల్పంగా వాంతులు, విరేచనాలు చేసుకున్నారు. ఈ తొమ్మిది మందిలో ఒకరిని ఐసీయూలో ఉంచి వైద్యాన్ని అందిస్తున్నట్లు రిమ్స్ డైరెక్టర్ తెలిపారు.

త్వరలో డిగ్రీ చివరి ఏడాది ఇన్‌స్టెంట్ పరీక్షకు నోటిఫికేషన్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో త్వరలో డిగ్రీ చివరి ఏడాది ఇన్‌స్టెంట్ పరీక్షకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు. ఎగ్జామినేషన్ కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. విద్యార్థులకు సమయం వృధా కాకుండా ఇన్‌స్టెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. బీఎడ్ మొదటి సెమిస్టర్ జూలై 19వ తేదీ నుంచి, బీఎడ్ నాల్గో సెమిస్టర్ జూలై 30 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాలో ఐదు కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు. బీటెక్ ఏడో సెమిస్టర్, పోస్టు గ్రాడ్యుయేషన్ మూడో సెమిస్టర్ రీవాల్యుయేషన్ ఫలితాలను గురువారం విడుదల చేసి, వర్సిటీ వెబ్ సైట్‌లో విద్యార్థులకు అందుబాటులో ఉంచినట్లు వివరించారు.

'ఐటీడీఏ స్కూళ్లలో ఒడియా టీచర్లను నియమించాలి'

కవిటి: శ్రీకాకుళం జిల్లాలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఐటీడీఏ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఒడియా ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి సమగ్రమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్(ఆపోటా) శాఖ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేసింది. గురువారం ఈ మేరకు కవిటి మండలం సహలాలపుట్టుగలో వారు ఈ విషయమై పత్రికల దృష్టికి సమస్యను వివరించారు. కంచిలి, సోంపేట, మందస మండలాల పరిధిలో 8 ప్రభుత్వ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలు, 3 ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలు ప్రత్యేకంగా ఒడియా గిరిజన విద్యార్థుల కోసం ఒడియా మాధ్యమంలో నిర్వహిస్తున్నారని, ఈ స్కూళ్లలో ఒడియా మీడియంలో టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయాలని కోరారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో గల ఒడియా పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 37 ఒడియా మాధ్యమం ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఇదే అంశంపై రాష్ట్ర గిరిజన మహిళ, శిశు సంక్షేమశాఖ మంత్రి జి. సంధ్యారాణికి నివేదిక అందించినట్లు ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (ఆపోటా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దోళాయి తెలిపారు.

కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలి

నరసన్నపేట: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, గుర్తింపు కార్డులు ఇచ్చిన ప్రతి రైతుకి పంట రుణాలు ఇవ్వాలని రైతు కూలీ సంఘం నాయకులు వి.గిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సివిల్ సప్లై డీటీకి వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో కౌలు రైతులే అధికమని వీరందరికీ రుణాలు ఇవ్వాలన్నారు. ఇతర రైతుల వలే తక్కువ వడ్డీకి వ్యవసాయ రుణాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

మంత్రి కృష్ణచంద్ర పాత్రోకి స్వాగతం


రాయగడ: మంత్రి పాత్రోకు వినతిపత్రం అందజేస్తున్న నాగరిక మంచ్ సభ్యులు


కొరాపుట్: మంత్రి కృష్ణచంద్ర పాత్రోకి స్వాగతం పలుకుతున్న బీజేపీ మహిళా కార్యకర్తలు

కొరాపుట్: రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖా మంత్రి కృష్ణచంద్ర పాత్రోకి ఘన స్వాగతం లభించింది. గురువారం సాయంత్రం రాయగడ జిల్లా పర్యటన ముగించుకొని కొరాపుట్ జిల్లా కేంద్రానికి ఆయన విచ్చేశారు. స్కిల్ డవలప్‌మెంట్ భవనం వద్ద బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం అక్కడ బీజేపీ మహిళా కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికార యంత్రాంగంతో జిల్లాలో పౌర సరఫరాల శాఖ పనితీరుపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో కోట్‌పాడ్ ఎమ్మెల్యేలు రుపు బోత్ర, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో, పార్టీ జిల్లా అధ్యక్షుడు సుమంత్ ప్రదాన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి సమస్యలు

రాయగడ: పట్టణంలో మంత్రి పర్యటన సందర్భంగా రాయగడ నాగరిక మంచ్‌కు చెందిన సభ్యులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఒక వినతిపత్రం సమర్పించారు. సదరు సమితి పరిధి బాకురుగుడ గ్రామం వద్ద సుమారు రూ.14 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్లానిటోరియంను ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీన అప్పటి సీఎం నవీన్ పట్నాయక్ అట్టహాసంగా వర్చువల్ మాధ్యమంలో ప్రారంభించారు. అయితే ప్లానిటోరియం ఇంతవరకు అందుబాటులోకి రాలేదని రాయగడ నాగరిక మంచ్‌కు చెందిన బాదల్ కుమార్ థా, రంజన్ రాథా తదితరులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా కొలనారకు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో 2017న ఫుడ్ పార్క్‌ని అప్పటి బీజేడీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనిని కూడా ఇంతవరకు ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో వివరించారు. ఈ నేపథ్యంలో స్పందించిన మంత్రి పాత్రో త్వరలో ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా త్వరలో ప్లానిటోరియంను పునః ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.


డిప్యూటీ సీఎం ప్రభాతి పరిదా


డిప్యూటీ సీఎం కనకవర్ధన్ సింగ్‌దేవ్


భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సీఎం మోహన్ చరణ్ మాఝీ

రాష్ట్రపతి ముర్ముతో సీఎం భేటీ

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, ఉప ముఖ్యమంత్రులు కనకవర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిదాలతో కలిసి గురువారం న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించడంతో పాటు, పూరీలో జగన్నాథుని రథయాత్ర కోసం ఆమెకు ఆహ్వానం పలికారు. ద్రౌపది ముర్ము ఒడిశాకు 3 రోజుల పర్యటనకు విచ్చేసి జూలై 7న పూరీలో జరిగే వార్షిక రథ యాత్ర కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంది. దేశంలోని అత్యున్నత పదవిని చేపట్టిన తర్వాత ఆమె తొలిసారిగా పూరీ జగన్నాథుని రథయాత్రకు విచ్చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా మోహన్ చరణ్ మాఝీ, కనకవర్ధన్ సింగ్‌దేవ్ మరియు ప్రభాతి పరిదా ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంవో) నుంచి ఫోను పిలుపు రావడంతో బుధవారం సాయంత్రం దేశ రాజధానికి బయల్దేరారు. ఈ ముగ్గురూ ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్ర మంత్రులను కూడా కలవనున్నారు. ఈనెల 12న ఒడిశాలో మొదటి భారతీయ జనతా పార్టీ ప్రభుత్వానికి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మోహన్ చరణ్ మాఝీ ఢిల్లీకి వెళ్లడం ఇదే తొలిసారి. ఈనెల 29 వరకు దేశ రాజధానిలో ఉన్న సమయంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు మరియు కేంద్ర ఆరోగ్య మంత్రి జె.పి.నడ్డాను కూడా కలవనున్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

- రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి కృష్ణచంద్ర పాత్రో
- అధికారులతో సమీక్ష సమావేశం



సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి పాత్రో, పక్కనే కలెక్టర్ మహాజన్ తదితరులు

రాయగడ: అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు పంపిణీ చేసే ప్రక్రియ త్వరలో ప్రారంభమవుతుందని రాష్ట్ర పౌరసరఫరాల, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి కృష్ణచంద్ర పాత్రో తెలియజేశారు. గురువారం ఆయన రాయగడలో పర్యటించారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మంజూరవుతున్న బియ్యం అందరికీ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అయితే ముఖ్యంగా అర్హులైన వారికి ఈ సదుపాయం కలగడం లేదని, అందువల్ల బోగస్ రేషన్ కార్డులను రద్దు చేయడంపై దృష్టి కేంద్రీకరిస్తామని తెలియజేశారు. త్వరలో రేషన్ కార్డుల విషయంలో సరైన దర్యాప్తు చేపట్టి అందుకు సంబంధించిన నివేదికను సమర్పించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మరో రెండు నెలల్లో కొత్త కార్డులను మంజూరు చేసే ప్రక్రియకు శ్రీకారం చుడతామన్నారు. సమావేశంలో కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్, గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగో, బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక, జిల్లా అదనపు కలెక్టర్ త్రినాథ్ మాఝి, జిల్లా పరిషత్ కార్యనిర్వాహక అధికారి కుహరొ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర

ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ఖరీఫ్‌లో పండించిన పంటలకు తగిన గిట్టుబాటు ధర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని, రైతులు మండీల్లో తమ ధాన్యాన్ని విక్రయించిన 48 గంటల్లో వారి అకౌంట్లలో డబ్బులు పడేలా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా జిల్లాలోని చాటికొన ప్రాంతంలో నియమగిరి పర్వత ప్రాంతాల్లో పండే అనాస, పనస తదితర పండ్ల జాతి పంటలపై రైతులకు గిట్టుబాటు ధరలభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో రైతుల సౌకర్యార్థం ప్రతీ జిల్లాలో శీతల గిడ్డంగులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.


సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు

ధరల నియంత్రణకు చర్యలు

గత కొద్ది రోజులుగా నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో దీనిపై దృష్టి సారించి సత్వరంగా ధరల నియంత్రణ చర్యలు తీసుకుంటామని మంత్రి పాత్రో స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా మంత్రి పర్యటన సందర్భంగా జిల్లా యంత్రాంగం వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని గురువారం ఉదయం 9.30 గంటల నుంచి స్థానిక సర్క్యూట్ హౌస్‌లో ఏర్పాటు చేసింది. గంట సమయం వరకు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లేందుకు సమయం కేటాయించినప్పటికీ ఈ సమాచారం సకాలంలో ఎవ్వరికీ తెలియకపోవడంతో ఆ కార్యక్రమం రద్దయ్యింది. అనంతరం స్థానిక సెరిగుడలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ కార్యకర్తలు ఘన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రజాభియోగాల విచారణ పునః ప్రారంభం

భువనేశ్వర్: రాష్ట్రంలో ప్రజాభియోగాల విచారణ జూలై 1 నుంచి పునః ప్రారంభించాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆదేశాలు జారీ చేశారు. అన్ని శాఖల వారీగా ప్రజా ఫిర్యాదుల విచారణను పునః ప్రారంభించాలని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఆదేశానుసారం ప్రజా ఫిర్యాదుల విచారణల పునః ప్రారంభం అన్ని ప్రభుత్వ శాఖలకు, విభాగాధిపతులకు, కలెక్టర్లు మరియు పోలీసు సూపరింటెండెంట్‌లు తమ జిల్లాల్లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల సంయుక్త విచారణలకు వర్తిస్తుంది. విచారణకు స్వీకరించిన అన్ని ఫిర్యాదులను పారదర్శకంగా పదిలపరిచేందుకు తప్పనిసరిగా జొనొ సునాని పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల విచారణను పునః ప్రారంభించడం ప్రభుత్వ పాలన పారదర్శకతను పెంపొందిస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ మేరకు సంబంధిత అధికారులకు సాధారణ పాలన, ప్రజా ఫిర్యాదుల విభాగం లేఖలు జారీ చేసింది.

ప్రభుత్వ అన్ని శాఖల్లో సోమవారం ప్రజా ఫిర్యాదుల విచారణ, విభాగాధిపతులు మరియు కలెక్టర్లు మరియు పోలీసు సూపరింటెండెంట్లు తమ జిల్లాల్లో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జూలై నెల 1 నుంచి పునఃప్రారంభించాలని లేఖలో పేర్కొంది.

రాష్ట్రంలో లోటు వర్షపాతం


రాష్ట్రంలో వర్షపాతం సమాచార చిత్రం

భువనేశ్వర్: ఈ ఏడాది రుతు పవనాలు రాష్ట్రంలోకి ముందస్తుగా ప్రవేశించినా ప్రయోజనం శూన్యంగా మారింది. ఇప్పటివరకు రాష్ట్రంలో సాధారణ వర్షపాతం నమోదు కాకపోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. జూన్ 1 నుంచి 27వ తేదీ వరకు నమోదైన వర్షపాతం గణాంకాలు ఈ పరిస్థితిని స్పష్టం చేస్తున్నాయి. ఈ వ్యవధిలో సాధారణ సగటు వర్షపాతం 181.6 మిల్లీ మీటర్లు కాగా, ఇప్పటివరకు 111.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు స్థానిక ప్రాంతీయ వాతావరణ కేంద్రం గురువారం తెలిపింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 6 జిల్లాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదు అయింది. 4 జిల్లాల్లో పరిస్థితి భయానకంగా కొనసాగుతోంది. ఈ జిల్లాల్లో భారీ లోటు వర్షపాతం కొనసాగుతుంది. మిగిలిన 20 జిల్లాలు సాధారణ లోటు వర్షపాతంతో కొట్టుమిట్టాడుతున్నాయి. భారీ లోటు వర్షపాతం ప్రాంతాల్లో కెంజొహర్, మయూర్ భంజ్, బాలాసోర్, పూరీ జిల్లాలు ఉన్నాయి. ఢెంకనాల్, కటక్, జగత్‌సింగ్‌పూర్, కంధమల్, నవరంగపూర్, మల్కన్‌గిరి 6 జిల్లాలు సాధారణ వర్షపాతం చవి చూశాయి. నవరంగపూర్ జిల్లాలో అత్యధికంగా సగటు వర్షపాతం 209.8 మిల్లీ మీటర్లు నమోదయ్యింది. కంధమల్ జిల్లాలో 189.5 మిల్లీ మీటర్లు, మల్కన్‌గిరి జిల్లాలో 167.6 మిల్లీ మీటర్లు, ఢెంకనాల్ జిల్లాలో 145.5 మిల్లీ మీటర్లు, కటక్ జిల్లాలో 142.6 మిల్లీ మీటర్లు, జగత్‌సింగ్‌పూర్ ప్రాంతంలో 125.7 మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతం రికార్డు అయింది.

బాధ్యతలు చేపట్టిన మంత్రి సురేష్ పూజారి


అధికారిక కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్న మంత్రి సురేష్

భువనేశ్వర్: రాష్ట్రంలో తొలిసారిగా ఏర్పాటైన భారతీయ జనతా పార్టీ మంత్రి మండలి సభ్యులు క్రమంగా పూర్తిస్థాయి కార్యకలాపాలను ప్రారంభిస్తున్నారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ప్రస్తుతానికి రాష్ట్ర అతిథి భవనంలో అధికారిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ పూజారి గురువారం అధికారిక కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు లోక్‌సేవా భవన్‌లోని తన కార్యాలయం గదిలో ప్రత్యేక పూజాదులు నిర్వహించారు. అనంతరం కార్యకలాపాలకు శ్రీకారం చుట్టి విభాగం ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. భూములకు పట్టాలు మంజూరు ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యాసంస్థలు, నీటి పారుదల ప్రాజెక్టులకు ప్రాధాన్యత ప్రాతిపదికన భూముల మంజూరు చట్ట పరిధిలో మంజూరు చేయాలని తొలి సమావేశంలో అధికారులకు ఆదేశించారు.

భీమారావుకు సత్కారం



ఖనిజాలు, మెటలర్జికల్ పరిశోధనలో అవకాశాలు, సవాళ్ల శీర్షికతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ రఘుపాత్రుని భీమారావుకు ప్రత్యేక సత్కారం లభించింది. స్థానిక వైజ్ఞానిక, పారిశ్రామిక పరిశోధన మండలి (సీఎస్ఐఆర్) ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ (ఐఎంఎంటీ) వజ్రోత్సవ వర్క్‌షాప్ నిర్వహణ సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ రామానుజ్ నారాయణ్ మోమెంటోతో సత్కరించారు.

– భువనేశ్వర్

శ్రీజగన్నాథునికి ఫులురి తైల సేవ


చికిత్స ఉపచారానికి సిద్ధమైన ఫులురి తైలం

భువనేశ్వర్: అతిగా స్నానమాచరించిన జగన్నాథుడు జ్వర పీడితుడిగా కనుమరుగున గోప్య వైద్య, చికిత్స ఉపచారాలు పొందుతున్నాడు. మరోవైపు భక్తులు స్వామివారు త్వరగా కోలుకుని తమకు యథాతథంగా నిత్య దర్శన భాగ్యం కల్పించాలని ఉవ్విళ్లూరుతున్నారు. గత 5 రోజులుగా తోబుట్టువులతో సహా స్వామివారు జ్వరంతో బాధపడుతున్నాడు. గురువారం ఒనొసారొ (అనవసర) పంచమి తిథి పురస్కరించుకుని ప్రత్యేక వనమూలికల తైలం ఫులురి సేవకు శ్రీకారం చుట్టారు. శ్రీమందిరం అధికార వర్గాల లిఖితపూర్వక ఆదేశాల మేరకు స్థానిక ఒడియా మఠం ఈ తైలం దేవస్థానం అధికార వర్గాలకు అందజేసింది.

తయారీ విభిన్నం

ఫులురి తైలం తయారీ విభిన్నం. ప్రత్యేక వన మూలికలతో ఏడాది క్రితం తయారు చేసి దీనిని పదిలపరుస్తారు. అతిబడి జగన్నాథ దాసు ఆది పీఠం అయిన బొడొ ఒడియా మఠం స్వామి సేవకు ఏటా ఈ తైలం ప్రదానం చేస్తుంది. ఒనొసారొ పంచమి నాడు స్వామి సేవకు ఈ తైలం సరఫరా చేస్తారు. అష్టమి నుంచి స్వామి వైద్య, చికిత్స ఉపచారాల్లో దీనిని వినియోగిస్తారు. ఈ తైల సేవతో దారు బ్రహ్మ ఏడాది పొడవునా చెక్కు చెదరకుండా భక్తులకు ప్రత్యక్ష దైవంగా సాక్షాత్కరిస్తాడు. ఫులురి తైలం తయారీలో పలు సుగంధ భరిత పుష్పాలు, వన మూలికలను విశేషంగా వినియోగిస్తారు. కేతకి, మల్లి, సంపంగి వంటి సుగంధ పుష్పాలను ఉపయోగించి నూనెను తయారు చేస్తారు. వీటితో పలు వన మూలికలు, గంధపు పొడి, కర్పూరం, బియ్యం మరియు పలు రకాల ధాన్యాలు నువ్వుల నూనెతో కలిపి తయారు చేస్తారు. ఏటా ముందు సంవత్సరం హీరా పంచమి పురస్కరించుకుని ఈ తైలం తయారు చేసి మట్టి పాత్రలో నింపి గుడ్డని చుట్టి భూమిలో పాతి బెట్టి నిల్వ చేస్తారు. తదుపరి సంవత్సరం భూమి నుంచి వెలుపలకు తీసి మూల విరాటుల సేవలో వినియోగిస్తారని బొడొ ఒడియా మఠం మహంత బన్సీధర్ దాస్ గోస్వామి తెలిపారు.

ఆ వాట్సాప్ గ్రూప్ సేవలకు హ్యాట్సాఫ్

- 'వే టు సక్సెస్' పేరిట 2 వేల మంది సభ్యులతో వాట్సాప్ గ్రూపు
- ఆరేళ్లుగా సేవలందిస్తున్న వైనం
- పోటీ పరీక్షల మెటీరియల్ అందిస్తూ యువతకు సాయం
- విజేతలుగా నిలుస్తున్న ఉద్దానం యువకులు

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కడ కొన్ని విజయ గాథలు ఉన్నాయి. వాటిలో కొన్ని స్ఫూర్తి మంత్రాలు దాగున్నాయి. ఊసు పోని కబుర్లకు వేదికగా నిలుస్తున్న వాట్సాప్ గ్రూపును పది మందికీ ఉపయోగపడేలా ఎలా తీర్చిదిద్దవచ్చో చెప్పే ఉదాహరణలు ఉన్నాయి. ఇవన్నీ తెలుసుకోవాలంటే.. ఆ గ్రూపు గురించి తెలుసుకోవాలి. రెండు వేల మంది ఆరేళ్లుగా ఆ గ్రూపు ద్వారా పొందిన సాయం తెలుసుకోవాలి. వే టు సక్సెస్ అన్న పేరుతో విజయానికి దారి చూపుతున్న ఈ వాట్సాప్ గ్రూప్‌నకు ఉద్దానం ప్రాంతానికి చెందిన విద్యావేత్త సీహెచ్ దామోదరరావు శ్రీకారం చుట్టారు. ఆయనే ప్రధాన అడ్మిన్‌గా ఉంటూ శ్రీను, రాజు, మనోజ్, మురళిలను సహాడ్మిన్లుగా చేర్చి సోషల్ మీడియా సాయంతో నిరుద్యోగ యువతకు సేవలు అందిస్తున్నారు. దామోదరరావు చేసిన సేవలను గుర్తిస్తూ అనేక సంస్థలు ఆయనను అనేక అవార్డులతో సత్కారించాయి.


గ్రూపు అడ్మిన్ దామోదరరావుకు స్పందన పురస్కారం అందిస్తున్న ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ప్రతినిధులు

పోటీ పరీక్షల మెటీరియల్ లభ్యం

ఈ గ్రూపులో ప్రధానంగా పోటీ పరీక్షల మెటీరియల్ లభిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్‌లతో పాటు ఉద్యోగం కోసం సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు విలువైన సమాచారాన్ని, పుస్తకాలను పీడీఎఫ్ రూపంలో అందుబాటులో ఉంచుతున్నారు. అలాగే నిరుద్యోగ యువతకు ఈ గ్రూప్ ద్వారా పలు సలహాలు, సూచనలు కూడా అందిస్తూ వారికి మార్గ నిర్దేశం చేస్తున్నారు. ఆంధ్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, అండమాన్ నికోబార్ దీవులు, కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్న ఉద్దాన యువతకు సైతం ఈ గ్రూపు ద్వారా విలువైన సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, రైల్వేతో పాటు గ్రూపు 1, గ్రూపు 2, బ్యాంకింగ్, పోలీసు, అటవీ శాఖ, ఉపాధ్యాయ, గ్రామ సచివాలయ ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్న యువతకు విలువైన సమాచారాన్ని అందిస్తున్నారు. అలాగే నవోదయ, సైనిక స్కూల్, సంక్షేమ పాఠశాల ప్రవేశ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న చిన్నారులకు సైతం ఈ గ్రూపు ద్వారా బాసటగా నిలుస్తున్నారు.

ఆనందంగా ఉంది..



నిరుద్యోగ యువతకు, చిన్నారులకు విలువైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలన్న లక్ష్యంతో 2018లో వే టు సక్సెస్ వాట్సాప్ గ్రూపుని ఏర్పాటు చేశాను. ఇప్పటి వరకు అనేక మంది నిరుద్యోగ యువకులు, చిన్నారులు దీన్ని సద్వినియోగం చేసుకొని వారి భవితకు బంగారు బాటలు వేసుకున్నారు. చాలా ఆనందంగా ఉంది. ఈ గ్రూపు ద్వారా విలువైన సలహాలు, సూచనలు అందిస్తున్న విద్యావేత్తలు, ప్రముఖులకు కృతజ్ఞతలు.

– సీహెచ్ దామోదరరావు, వాట్సాప్ గ్రూపు అడ్మిన్, సోంపేట మండలం

రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్న చిన్నారులు

నిరుద్యోగులే కాదు.. చిన్నారులు కూడా ఈ గ్రూపు ద్వారా అందుతున్న సమాచారాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

'మాజీ మంత్రి రఘునందన్ దాస్‌పై చర్యలు చేపట్టాలి'


నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

భువనేశ్వర్: విధి నిర్వహణలో భాగంగా కవరేజీ కోసం ప్రయత్నించబోయిన మహిళా జర్నలిస్టుపై తన కుక్కలను విడిచిపెట్టి మాజీ మంత్రి రఘునందన్ దాస్ తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ చర్యకు వ్యతిరేకంగా పలువురు వర్కింగ్ జర్నలిస్టులు గురువారం నగరంలో నిరసన తెలిపారు. పాత్రికేయులతో అత్యంత సన్నిహితంగా వ్యవహరించిన మాజీ మంత్రి విలేకరి విధి నిర్వహణకు ప్రాణాంతకంగా అంతరాయ కలిగించడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు వ్యతిరేకంగా కఠిన చర్యలు చేపట్టాని డిమాండ్ చేస్తూ స్థానిక జయదేవ్ భవన్ ముందు జర్నలిస్టులు నిరసనలు చేపట్టారు. ఘటన జరిగి మూడు రోజులు గడుస్తున్నా పోలీసులు మౌనంగా ఉండడాన్ని ప్రశ్నించారు. నిరసన ర్యాలీకి హాజరైన పలువురు సీనియర్ జర్నలిస్టులు మాజీ మంత్రి తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పొరుగు ప్రాంగణంలో ఉన్న బీజేడీ సంస్థాగత కార్యదర్శి ప్రణబ్ ప్రకాష్ దాస్ నివాసంలో అదనపు నిర్మాణాన్ని కూల్చివేసే దృశ్యం కవరేజీ కోసం తన అధికారిక నివాసం ప్రాంగణంలోనికి ప్రవేశించిన విలేకరిపై మంత్రి ఈ దారుణానికి పాల్పడ్డారు.

క్లుప్తంగా

తేనెటీగల దాడిలో ఇద్దరికి గాయాలు



గాయపడిన పోలిరెడ్డి దామోధరరావు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దత్తి తవిటినాయుడు

వంగర: మండల పరిధిలోని మగ్గూరు గ్రామంలో తేనెటీగలు దాడి చేయడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంకును శుభ్రపరిచేందుకు గ్రామానికి చెందిన దత్తి తవిటినాయుడు, పోలిరెడ్డి దామోదరరావు ట్యాంకు లోపలికి దిగారు. అప్పటికే తేనెపట్టు ఉండడాన్ని గమనించిన వారిద్దరూ బయటకు వచ్చే ప్రయత్నం చేశారు. ఇంతలో తేనెటీగలు దాడి చేయడంతో ఇద్దరూ గాయపడ్డారు. వెంటనే కుటుంబ సభ్యులు, సర్పంచ్ పోలిరెడ్డి రమేష్ బాధితులిద్దరినీ రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

పాముకాటుతో మహిళ మృతి



అట్టాడ లక్ష్మి (ఫైల్)

గుర్ల: మండలంలోని గుజ్జింగివలసకు చెందిన అట్టాడ లక్ష్మి (55) పాముకాటుతో గురువారం మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గుజ్జింగివలసకు చెందిన అట్టాడ లక్ష్మి పాన్‌షాప్ నిర్వహిస్తు జీవనం సాగిస్తోంది. ప్రతి రోజులాగే పాన్‌షాప్ తెరిచి శుభ్రం చేస్తుండగా పాము చేతిపై కాటు వేసింది. వెంటనే స్థానికులు స్పందించి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. లక్ష్మిని గుర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దళితులపై దాడి



ఫిర్యాదు చేస్తున్న దళితులు



గాయాలపాలైన దుర్గ

గరుగుబిల్లి: దళితులపై కొంతమంది రైతులు దాడి చేసిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. మండలంలోని శివ్వాం గ్రామానికి చెందిన 14 మంది దళితులకు 25 ఎకరాలకు 1970లో అధికారులు పట్టాలు మంజూరు చేశారు. అప్పటినుంచి ఆ భూమిని దళితులు సాగు చేసుకుంటూ వస్తున్నారు. అయితే గ్రామంలోని కొంత మంది రైతులు దళితులు సాగు చేసుకుంటున్న భూమిలో తమకు పట్టాలున్నాయంటూ ఆక్రమణకు వెళ్లారు. దీంతో ఇరువురు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ సంఘటనలో గ్రామానికి చెందిన రేగిడి దుర్గకు గాయాలయ్యాయి. ఈ మేరకు బాధితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు డిమాండ్ చేశారు.

వేణుగోపాలస్వామి సన్నిధిలో చాగంటి



ప్రవచనాలు చెబుతున్న చాగంటి కోటేశ్వర రావు

బొబ్బిలి: పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయాన్ని ప్రముఖ ప్రవచనకారుడు, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు దంపతులు గురువారం సాయంత్రం సందర్శించి, స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు, పురోహితులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, స్వామి వారి ఆశీర్వచనాలను ఆయనకు అందజేశారు. ఆ తర్వాత భక్తులను ఉద్దేశించి, చాగంటి చేసిన ఆధ్యాత్మిక ప్రసంగం ఆలోచింపజేసింది.

మోసాలందు..
సైబర్ మోసాలు వేరయా..!

- సైబర్ నేరగాళ్ల కొత్త మాయ
- యువతే లక్ష్యంగా పార్ట్‌టైమ్ జాబ్‌లంటూ ఎర
- బయోడేటా సేకరించి కాల్స్ చేస్తున్న నేరగాళ్లు
- రూ. వేల నుంచి లక్షల్లో దోపిడీ
- జిల్లాలో పెరుగుతున్న బాధితులు



పార్వతీపురం టౌన్: యువతే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు బరి తెగిస్తున్నారు. ఉద్యోగాల పేరిట గాలం విసిరి రూ. లక్షల్లో దోచేస్తున్నారు. పార్ట్‌టైమ్ జాబ్‌లంటూ మోసం చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికలపై ఆన్‌లైన్ నకిలీ ప్రకటనలతో గారడీ చేసి బ్యాంకు ఖాతాలు లూటీ చేస్తున్నారు. బాధితుల్లో ఎక్కువ మంది చదువుకున్న వారే. పలు ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఇంజినీరింగ్ వంటి సాంకేతిక విద్యనభ్యసించిన నిరుద్యోగులు ఎక్కువగా మోసపోతుండడం గమనార్హం.

బయోడేటా సేకరించి కాల్స్

ప్రముఖ ఆన్‌లైన్ జాబ్ సెర్చ్ ఇంజిన్లలో ఇచ్చిన బయోడేటా ఆధారంగా నిరుద్యోగుల సమాచారం సేకరించి సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఒక కాల్ సెంటర్ ఏర్పాటు చేసుకుని జాబ్ కన్సల్టెన్సీ ముసుగులో ఉద్యోగాల కోసం అన్వేషిస్తున్న వారికి మెయిళ్లు పంపిస్తారు. అవసరమైతే కాల్ చేస్తారు. ఇంటర్వ్యూ పేరుతో మోసం చేస్తారు. రకరకాల ప్రశ్నలు వేసి సమాచారాన్ని రాబడతారు. జాబ్ వచ్చేసినట్టే నమ్మిస్తారు. రిజిస్ట్రేషన్ చార్జీలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఫీజులు, యూనిఫారం, అడ్వాన్స్, సెక్యూరిటీ డిపాజిట్ వంటి పేర్లతో దోచుకుంటారు.

వర్క్ ఫ్రమ్ హోం పేరుతో..

చాలా మంది ఎక్కువగా ఇంటి వద్ద ఉంటూ పనిచేయడానికే ఇష్టపడతారు. జాబ్ స్కామ్ చేసే వాళ్లు వీరినే ఎక్కువగా టార్గెట్ చేసుకుంటున్నట్లు పోలీసులు చెబుతున్నారు. తక్కువ సమయం, తక్కువ శ్రమతోనే నెలకు వేలాది రూపాయలు సంపాదించవచ్చని నమ్మించి నగదు దోచేసి నేరగాళ్లు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేస్తున్నారు. కొందరైతే డేటా ఎంట్రీ పని ఉందని, ఎక్కువ స్కిల్స్ అవసరం లేదని, చాలా ఎక్కువ డబ్బులిస్తామని నమ్మిస్తారు. ముందుగానే ప్రాసెసింగ్ ఫీజు, ట్రైనింగ్ ఫీజు రూపంలో అడ్వాన్స్ పేమెంట్ చేయించుకుంటారు. డేటా ఎంట్రీ అనంతరం అందులో తప్పులున్నాయని, దాని వల్ల సంస్థ నష్టపోయిందని, పరిహారం చెల్లించాలని, లేకుంటే లీగల్ ప్రొసీడింగ్స్‌కు వెళతామని బెదిరించి అధిక మొత్తంలో తిరిగి డబ్బులు వసూలు చేస్తారు.

నకిలీలను ఇలా గుర్తించాలి..

- ఉద్యోగ ప్రకటనలన్నీ నిజం కావని గ్రహించాలి.
- సాధారణంగా ప్రముఖ సంస్థలు ఎప్పుడూ రిజిస్ట్రేషన్ ఫీజు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ చార్జీలు వసూలు చేయవు.
- ప్రకటనల్లోని లోగో లెటర్లను గమనించాలి.
- జాబ్ స్కామ్/ఫ్రాడ్ చేసేవారు పంపే మెయిళ్లు గమనిస్తే కాస్త తేడాగా ఉంటాయి.
- నేరగాళ్లు ఉద్యోగ ప్రకటనల్లో గానీ, ఈ-మెయిల్స్‌లో గానీ ఎక్కువగా గ్రామర్ తప్పులుంటాయి. జాబ్ డిస్క్రిప్షన్ కూడా స్పష్టంగా ఉండదు.
- క్విక్ మనీ, అన్ లిమిటెడ్ ఎర్నింగ్స్, స్కిల్స్ అవసరం లేదు అనే పదాలు చూసిన వెంటనే అప్రమత్తం కావాలి.
- అనుమానం వచ్చిన వెంటనే 1930 సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేయాలి. లేదా మీ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలి.

చర్యలు చేపడతున్నాం..



సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు చేపడతున్నాం. కొన్ని ప్రాంతాల్లో కొంతమంది చదువుకున్న యువత మోసపోవడం ఆశ్చర్యపరుస్తోంది. ఉద్యోగాలకు డబ్బులివ్వడమేమిటీ అనే ఆలోచన చేయాలి. యువత జాబ్ ప్రకటనలకు స్పందించే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. పూర్తి సమాచారం తెలుసుకున్నాకే నిర్ణయం తీసుకోవాలి.

–విక్రాంత్ పాటిల్, ఎస్పీ, పార్వతీపురం మన్యం

కేవీకేలు సేవలు దేశానికే గర్వకారణం



విజయనగరం కృషివిజ్ఞాన కేంద్రానికి షీల్డ్‌ను అందజేస్తున్న ఐసీఏఆర్-అటారి డైరెక్టర్ మీరా, మాధూర్ తదితరులు

- ఐసీఏఆర్-అటారి డైరెక్టర్ డాక్టర్ షేక్‌ఎన్‌మీరా
- ముగిసిన కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక సమీక్ష సమావేశాలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా అందించే రైతుసేవలు, విస్తరణ కార్యక్రమాలు రాష్ట్రానికే కాకుండా భారతదేశానికే గర్వకారణమని ఐసీఏఆర్-అటారి డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరా అన్నారు. స్థానిక సీటీఆర్ఐ సమావేశ మందిరంలో మూడురోజులుగా జరుగుతున్న వ్యవసాయ సాంకేతిక అనుప్రయోగ పరిశోధనా సంస్థ జోన్ 10 కృషివిజ్ఞాన కేంద్రాల వార్షిక సమీక్ష సదస్సు గురువారంతో ముగిసింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ షేక్‌ఎన్ మీరా మాట్లాడుతూ ముందు ప్రతి ఒక్క కృషివిజ్ఞానకేంద్రం పోటీతత్వంతో పనిచేసి రైతు వద్దకు పరిశోధన ఫలితాలను నిరంతరం తీసుకువెళ్లాలన్నారు. ఈ సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు ఐసీఏఆర్-సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ సభ్యులందరినీ డాక్టర్ షేక్‌ఎన్‌మీరా ఘనంగా సత్కరించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న భారత నూనెగింజల పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కే మాధుర్ మాట్లాడుతూ కృషివిజ్ఞాన కేంద్రాల ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక సమీక్షా సమావేశాల ముగింపు కార్యక్రమం సందర్భంగా 72 కృషి విజ్ఞాన కేంద్రాలకు, కేవీకే ఆదేశాల ప్రకారం వివిధ అంశాలలో అత్యుత్తమ ప్రదర్శనకు గాను ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ప్రకృతి వ్యవసాయంలో కలవచర్ల సీటీఆర్ఐ-కేవీకేకు, వికసిత భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమానికి కందుకూరు సీటీఆర్ఐ-కేవీకేకు సర్టిఫికెట్లు లభించాయి. యాగంటిపల్లి కృషి విజ్ఞాన కేంద్రానికి అత్యుత్తమ ప్రతిభ, విత్తన-నారు మొక్కల ఉత్పత్తి, కేవీకే ఆర్థికాభివృద్ధికి విశిష్టసేవలు అందించినందుకు రోలింగ్ షీల్డ్ ప్రదానం చేశారు. విజయనగరం కృషి విజ్ఞాన కేంద్రం 2023-24 సంవత్సరానికి ఉత్తమైనదిగా ఎంపిక కావడంతో షీల్డ్‌ను అందించారు. కలవచర్ల సీటీఆర్ఐ-కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వై.సుబ్బయ్య, కేవీకేల అధిపతులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణకు పాల్పడితే చర్యలు



సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీఓ శాంతి

చీపురుపల్లి: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని ఆర్డీఓ బి.శాంతి అన్నారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో వైద్యారోగ్య శాఖ సిబ్బందితో పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో ఆడపిల్లల పట్ల చూపుతున్న వివక్షతపై పరిశీలన చేయాలన్నారు. గర్భస్రావాల పేరుతో కడుపులో ఉన్న ఆడ పిల్లలను చంపేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భ్రూణ హత్యల నిరోధానికి పీఎన్‌డీటీ చట్టం కఠినంగా అమలు చేయాలని కోరారు. లింగ నిర్ధారణ చేపట్టిన స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఎన్.సూర్యనారాయణ, చిన్న పిల్లల వైద్య నిపుణుడు ఎం.నాయక్, స్త్రీ వైద్య నిపుణులు ప్రశాంత్, హ్యూమన్ రైట్స్ ప్రతినిధి వి.పద్మలత, తదితరులు పాల్గొన్నారు.

9న తపాలా, పెన్షన్ అదాలత్

విజయనగరం టౌన్: తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించేందుకు ఈ నెల 9వ తేదీన ఉదయం 10 గంటలకు హెడ్‌పోస్టాఫీస్‌లో తపాలా, పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తపాలా సర్వీసులకు సంబంధించిన ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులు మాత్రమే అదాలత్‌లో చర్చిస్తామని పేర్కొన్నారు.

హత్యాయత్నానికి పాల్పడిన 11 మంది అరెస్ట్

- నిందితులకు 14 రోజుల రిమాండ్
- 24 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్సై షేక్ శంకర్ (వెనుక ముసుగులో నిందితులు)

రాజాం సిటీ: పాతకక్షల నేపథ్యంలో ఈ నెల 25వ తేదీ రాత్రి ఓ యువకుడుపై హత్యాయత్నానికి పాల్పడిన 11 మందిని 24 గంటల వ్యవధిలో పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ ఎస్.శ్రీనివాసరావు వెల్లడించారు. రాజాం పట్టణ పరిధి గొల్లవీధిలో జరిగిన ఓ ఫంక్షన్‌కు స్నేహితులతో కలసి శ్రీకాకుళానికి చెందిన టి.గౌతమ్ హాజరయ్యాడు. ఫంక్షన్ అనంతరం జీఎంఆర్ కేర్ జంక్షన్‌కు వెళ్లి తన స్నేహితుడైన గొల్లవీధికి చెందిన కోడిబోయిన కార్తీక్, మరి కొంత మంది స్నేహితులను కలిసి తిరిగి మోటార్ సైకిళ్లపై వస్తున్నారు. అప్పటికే కార్తీక్‌తో గొడవలు ఉన్న గురవాంకు చెందిన కుప్పిలి నవీన్ వీరు రావడాన్ని గమనించి కార్తీక్‌పై ఉమ్మివేశాడు. దీంతో కార్తీక్ ఎందుకు ఉమ్మి వేశావని ప్రశ్నించగా.. నవీన్‌తో పాటు అతని 14 మంది స్నేహితులు కర్రలు, కత్తులతో దాడికి యత్నించారు. ఈ దాడి నుంచి కార్తీక్‌తో పాటు ఇతర స్నేహితులు తప్పించుకోగా.. శ్రీకాకుళానికి చెందిన గౌతమ్ వారికి దొరికిపోయాడు. దీంతో అతడ్ని మోటార్ సైకిల్‌పై గురవాం సమీపంలోని తోటలోకి తీసుకువెళ్లి కర్రలు, రాడ్డులు, బెల్టులతో మూకుమ్మడిగా దాడి చేశారు. గాయాలపాలైన గౌతమ్‌కు ఫొటోలు తీసి వాట్సాప్‌లో కార్తీక్‌కు పంపారు. దీంతో అప్రమత్తమైన కార్తీక్ పోలీసులకు సమాచారం అందించి గాయపడిన గౌతమ్‌ను ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నానికి పాల్పడిన 11 మంది నిందితులను గురవాం తోటల సమీపంలోను, పొనుగుటివలస జంక్షన్ వద్ద గురువారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయినవారిలో కుప్పిలి నవీన్, దుంగ సాయి, గుంట ప్రదీప్, కుప్పిలి ధనుంజయ, టొంపల అనిల్‌కుమార్, తోలేటి ఉదయ్‌కుమార్, సూరపాటి సాయికుమార్, టొంపల రవిచైతన్య, తిర్లంగి అక్షయ్‌కుమార్, కొర్ల ఫణీంద్ర, చింతాడ విద్యాసాగర్ ఉన్నారు. కుప్పిలి నవీన్‌పై కొట్లాట, గంజాయి కేసులు సంతకవిటి, రాజాం స్టేషన్లలో ఇప్పటికే నమోదయ్యాయి. నిందితులపై రౌడీషీట్ ఓపెన్ చేసి రాజాం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా.. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. కార్యక్రమంలో సంతకవిటి ఎస్సై షేక్ శంకర్ ఉన్నారు.



దాడికి ఉపయోగించిన రాడ్డులు, కత్తి, బెల్టు

సజావుగా పెన్షన్ల పంపిణీ

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎంపీడీఓలు

విజయనగరం అర్బన్: జిల్లాలో పెన్షన్ల పంపిణీ ప్రక్రియ ప్రభుత్వ ఉద్యోగులతో మాత్రమే సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎంపీడీఓలను ఆదేశించారు. పింఛన్ల పంపిణీపై ఎంపీడీఓలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పింఛన్ల పంపిణీ 1వ తేదీనే పూర్తి చేయాలని.. ఎక్కడైనా మిగిలి ఉంటే 2వ తేదీ నాటికి శతశాతం పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. పంపిణీలో రెగ్యులర్ ఉద్యోగులు మాత్రమే ఉండాలని, తాత్కాలిక ఉద్యోగులు పాల్గొనరాదని సూచించారు. ఇందుకోసం వెంటనే క్లస్టర్ వారీగా సిబ్బంది మ్యాపింగ్ జరగాలని.. 50 నుంచి 60 మందిని ఒక క్లస్టర్‌లో చేర్చి ఆ వివరాలను శుక్రవారం ఉదయానికి తనకు అందించాలని ఆదేశించారు. పింఛన్లకు సంబంధించిన నగదును శనివారమే బ్యాంకుల నుంచి డ్రా చేయాలని, అవసరమైతే పోలీస్ వారి సహకారాన్ని తీసుకోవాలని తెలిపారు. నగదు డ్రా చేయడానికి పంచాయతీ సెక్రటరీతో పాటు వెల్ఫేర్ అసిస్టెంట్ కూడా వెళ్లాలన్నారు. బయోమెట్రిక్ యంత్రాలను ఒకసారి తనిఖీ చేసుకొని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. పాత పింఛన్ పుస్తకాలను వినియోగించవద్దని.. పింఛన్ అందజేసిన తర్వాత అకనాలడ్జ్‌మెంట్ తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 2,81,713 మందికి రూ.186.89 కోట్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ అనిత, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, డీపీఓ శ్రీధర్‌రాజా, జీఎస్‌డబ్ల్యూ అధికారి నిర్మలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఫేక్ కాల్స్ పట్ల అప్రమత్తం

- ఎస్పీ ఎం.దీపిక



విజయనగరం క్రైమ్: ఇటీవల కాలంలో ఫేక్ కాల్స్ చాలా ఎక్కువయ్యాయని, వాటి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఎం. దీపిక పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫెడెక్స్, బ్లూడాట్ కొరియర్స్, డిజిటల్ అరెస్ట్, బిట్ కాయిన్స్ , క్రిప్టో కరెన్సీ అనే పేర్లతో వచ్చే కాల్స్, లింక్స్, వీడియో కాల్స్‌తో చాలా మంది ప్రజలు మోసపోతున్నారని చెప్పారు. సైబర్ నేరగాళ్లు ఫోన్‌లు చేసి ముందుగా సేకరించిన మన చిరునామా, ఆధార్, ఫోన్ నంబర్ వంటి కొంత సమాచారాన్ని మనకు తెలియజేస్తారన్నారు. అనంతరం మనం బుక్ చేసుకున్న కొరియర్ పార్సిల్‌లో నిషేధిత మాదకద్రవ్యాలు, ఫేక్ పాస్‌పోర్టు, బంగారం వంటివి ఉన్నాయని చెబుతారన్నారు. ఈ వ్యవహారంపై కేసు నమోదైందని చెప్పి సీబీఐ, టాస్క్‌ఫోర్స్ ఉన్నతాధికారులతో మాట్లాడాలని చెప్పి, వారి మనుషులకే ఫోన్ నంబర్లు కలుపుతారని చెప్పారు. వారు తమను సీబీఐ అధికారులుగా పరిచయం చేసుకుని మీరు బుక్ చేసిన పార్సిల్‌లో మాదకద్రవ్యాలు ఉన్నాయని, దర్యాప్తు నిమిత్తం రావాల్సి ఉంటుందని భయపెడతారని తెలిపారు. ఒకవేళ రాలేనిపక్షంలో ఆన్‌లైన్‌లో దర్యాప్తునకు హాజరుకావచ్చని చెప్పి, ఓ లింక్ పంపిస్తారన్నారు. ఆ లింక్ ఓపెన్ చేస్తే మన బ్యాంక్ ఖాతాల్లోని నగదు మొత్తం కొల్లగొట్టేస్తారని చెప్పారు. అదేవిధంగా బిట్ కాయిన్, క్రిప్టో కరెన్సీ పేరుతో తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని ప్రజలను నమ్మించి మోసం చేస్తారని తెలిపారు. జిల్లాలో ఇటువంటి కేసులు ఇటీవల ఎక్కువవుతున్నాయన్నారు. ప్రజలందరూ ఇటువంటి ఫేక్ కాల్స్, లింక్‌లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంక్ ఖాతా నంబర్, పాస్‌పోర్టు, ఆధార్ నంబర్లు, మొబైల్స్‌కు వచ్చే ఓటీపీ నంబర్లు ఎవ్వరికీ చెప్పవద్దన్నారు. ఈ తరహా నేరాల్లో ఎవరైనా నగదు పోగొట్టుకున్నట్లయితే 1930కు లేదా నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో రిపోర్టు చేయాలని కోరారు.

జిల్లా తైక్వాండో జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు, తదితరులు

విజయనగరం రూరల్: ఈ నెల 30 నుంచి విశాఖపట్నంలో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి క్యాడిట్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపికలు గురువారం నిర్వహించారు. జిల్లా కేంద్రం శివారు విజ్జీ స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో అండర్- 12, అండర్- 13, అండర్- 14 విభాగాల్లో బాల బాలికలను ఎంపిక చేశారు. జిల్లాలోని 8 మండలాల నుంచి 50 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. తైక్వాండో జిల్లా అధ్యక్షుడు డి.వి.చారి, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్ శర్మ, కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు రిఫరీలుగా కె.రామకృష్ణ, శేఖర్, ఉదయ్, దిలీప్, చంద్రశేఖర్ వ్యవహరించారు. ఎంపికైన క్రీడాకారులను డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు, కార్యదర్శి త్రినాథరావు అభినందించారు.

ఏజెన్సీ గ్రామాలకు ఫీడర్ అంబులెన్స్‌లు



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాక్షి, పార్వతీపురం మన్యం: ఏజెన్సీలోని గిరిజన గ్రామాలకు ఫీడర్ అంబులెన్స్‌లు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఏజెన్సీ గ్రామాల్లో డోలీ పరిస్థితి ఎక్కడా ఉండరాదని..ఇందుకు అవసరమైన రహదారుల పైనా దృష్టి సారించాలని సూచించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు అడిగిన మేరకు విత్తనాలు సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం గురువారం ఆమె తొలిసారిగా పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ జిల్లాను అభివృద్ధి పథంలో నడపాలని ఆకాంక్షించారు. త్వరలో ఐటీడీఏ పాలకమండలి సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. భూ సమస్యలు ఉన్నాయని, వాటిని నివారించాలని సూచించారు. రైతులు అడిగిన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలని చెప్పారు. నకిలీ విత్తనాలు, ఎరువులపై దృష్టి సారించాలని..గత ఐదేళ్లలో ఇచ్చిన పంట నష్టపరిహారం, పెండింగ్ వివరాలు సమర్పించాలని ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న వ్యవసాయ సహాయకుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. పంట కొనుగోలు కేంద్రాలు సక్రమంగా పనిచేయలేదన్న ఆరోపణలు ఉన్నాయని, మొక్క జొన్న, పత్తి కొనుగోలులో ఎటువంటి ఇబ్బందులూ ఉండరాదని స్పష్టం చేశారు.

వసతిగృహాల్లో ఏఎన్‌ఎంల నియామకం

వసతి గృహాల్లో జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. వసతిగృహాల్లో ఏఎన్‌ఎంల నియామకంపై చర్యలు చేపడుతున్నామన్నారు. రక్తదాన శిబిరాలు జిల్లా ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీలకు సరఫరా చేసే గుడ్లు, పాలు నాణ్యత కలిగి ఉండాలని ఆదేశించారు. వాటిపై ఏ బొమ్మలూ ఉండరాదని చెప్పారు. అంగన్‌వాడీ పోస్టుల భర్తీని సంవత్సరంలో ఒక నిర్దిష్ట కాలంలో జరపాలని సూచించారు. గిరిజన సంక్షేమ, ఆశ్రమ వసతి గృహాల్లో విద్యార్థులకు దుప్పట్లు, కంచాలు, గ్లాసులు, పుస్తకాలు, నాణ్యమైన భోజనం అందాలని, ఆకస్మిక తనిఖీలు చేస్తామని స్పష్టం చేశారు. ఇళ్ల నిర్మాణాలు, నాణ్యత, లే అవుట్ స్థలాలపై నివేదిక సమర్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్ నిషాంత్‌కుమార్ మంత్రికి వివరించారు.

ఆపరేషన్ థియేటర్ సమకూర్చాలి

పాలకొండ ఏరియా ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ లేదని, దానిపై దృష్టి సారించాలని ఆ నియోజకవర్గం శాసనసభ్యుడు నిమ్మక జయకృష్ణ మంత్రి సంధ్యారాణిని సమావేశంలో కోరారు. అలాగే సమావేశంలో పాల్గొన్న కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి మాట్లాడుతూ అంబులెన్సులు లేక గిరిజన గ్రామాల్లో సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. గుమ్మలక్ష్మీపురం సీహెచ్‌సీ, పీహెచ్‌సీలలో మందులు లేవని తెలియజేశారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర మాట్లాడుతూ ఉద్యాన పంటల మార్కెటింగ్‌పై దృష్టి సారించాలని కోరారు. వివిధ శాఖల అధికారులు తమ పరిధిలోని ప్రగతిని సమావేశంలో వివరించారు. జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఇన్‌చార్జ్ డీఆర్‌వో జి.కేశవనాయుడు, వివిధ శాఖల అధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

ప్రతిపక్ష హోదా ఎలా అడుగుతారు?

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా అడిగే అర్హత లేదని ఏపీ మహిళాశిశుసంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గురువారం పార్వతీపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తాము 164 సీట్లు గెలిస్తే, వైఎస్సార్‌సీపీ 11 సీట్లకే పరిమితమైందన్నారు. ఆ సీట్లతో ప్రతిపక్ష హోదా అడుగుతున్నారంటే..తనకేమీ అర్థం కావడం లేదన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు బోనెల విజయ్‌చంద్ర, జగదీశ్వరి, నిమ్మక జయకృష్ణ పాల్గొన్నారు.